కథ

కేసులేని హత్య

పొన్నాడ. సత్యప్రకాశరావు

రాత్రి పదకొండు గంటలు కావస్తోంది.

టేబిల్ మీదకి వాలిపోయి దీక్షగా వ్రాసుకొంటున్న హిమజ భుజాలపై వెనుకనించి చేతులు వేసాడు శ్రీకాంత్.. . ఆమె భర్త.

ఉలిక్కిపడి "అబ్బ! మీరా... ఇంకా నిద్రపోలేదూ?" అంది... నువ్వు రాకుండా నిద్రెలా పడుతుంది?

"ఇంకో పావుగంటలో కథ ముగింపు కొచ్చేస్తుందండి... రాసి వచ్చేస్తా మీరు వెళ్ళి పడుకోండి"

"నేను కూడా రాయడానికే పిలుస్తున్నానోయ్... అక్కడ రాద్దువు కానిరా" రెండు సింగిల్ కాట్స్ జత చేసి అందంగా అమర్చిన బెడ్‌వైపు చూపిస్తూ అన్నాడు... బెడ్ మీద ఒక ప్రక్కగా పిల్లలు పల్లవి, చరణ్ పడుకొని ఉన్నారు...

"అన్ని దొంగమాటలే... అసలు మీ మగాళ్ళకి వేరే ధ్యాస ఉండదాండీ"?

"ఉండదండీ... అండీ.. కావాలంటే బెడ్ మీద కూర్చొని రాసుకో ఓ చేత్తో నన్ను జోకొడుతూ"

అమ్మో! మిమ్మల్ని నమ్మలేను... రాసేసి వస్తా", ఇంకా ఏదో చెబుదామనుకొంది కాని ఆమె మెడక్రింద వంపులో అతని వేడి ముద్దు ఆమెను అతను చెప్పినట్లు చేయించింది...

బెడ్ మీద గోడకి ఆనుకొని వళ్ళో ప్యాడ్ పెట్టుకొని వ్రాసుకో సాగింది... మధ్య మధ్యలో శ్రీకాంత్ తల నిమురుతూ...ఒక్క నిముషం గడిచిందో లేదో శ్రీకాంత్ చేతులు లైట్ స్విచ్ మీదికి వెళ్ళడం హిమజ వళ్ళోని ప్యాడ్, కాగితాలు, కలం బెడ్ క్రిందకి జారిపోవటం జరిగింది.

అలా అతని చేతిలో ఆమె "మోసపోవటం" ఆ గది గోడలు పదేళ్ళగా చూస్తున్నాయి..

అరగంట తరువాత శ్రీకాంత్ నిద్రలోకి జారుకొన్నాక లేవబోయింది కాని ఆమె చుట్టు బలంగా ఉన్న చేతులను విడదీయు లేక అలాగే ఉండి పోయింది... మనసు గతంలోకి జారుకుంది.

◆◆◆

"అమ్మాయి రచయిత్రీ ఆటకదా" హిమజ పెళ్ళి చూపులలో కాబోయే మామగారు అడిగారు..

"అవునండీ... వివిధ పత్రికలలో ఓ పదిపన్నెండు కథలు పడ్డాయి" గర్వంగానే చెప్పారు హిమజ తండ్రి...

"కథలు సరె! వంటా వార్పు వచ్చా" కాబోయే అత్తగారి ఆరా..

"వచ్చండీ" చెప్పారు... అంతగా రావు.. గారాల పట్టి మరి!

"నువ్వేమన్నా మాట్లాడతావురా" శ్రీకాంత్‌ని నడిగింది అతని అక్కగారు. .. మాట్లాడాలనే ఉన్నా అడ్డంగా ఊపాడు బుర్రని. అయినా ఆ అవకాశం అడగకుండానే కల్పించొచ్చుగా మనసులోనే తిట్టుకున్నాడు శ్రీకాంత్.

"అమ్మాయి నచ్చిందిరా?" అన్న ప్రశ్నకి ఆడదానిలా సిగ్గు పడటం తప్ప ఇంకేమి చెప్పలేకపోయాడు.

◆◆◆

కాపురానికి వచ్చిన రెండో నెలలోనె నెల తప్పింది హిమజ. క్రొత్త వాతావరణము అత్త, మామలు, మరుదులు, ఆడపడుచులు పెద్ద కుటుంబమే వంటావార్పు అంత బాగా రాకపోవటంతో పైగా అత్తగారి సణుగుళ్ళ వలన పని డబుల్ అయ్యింది. ఎప్పుడైనా మనసులో మెదలాడె భావాలను కాగితం మీద పెట్టాలను కొనేది కాని అత్తగారి భయం వలన ఊరుకొనేది ఆర్థిక సమస్యల వలన ఉద్యోగం కూడా చెయ్యవలసి వచ్చింది. కాన్వెంట్‌లో టీచర్‌గా చేరింది. ఆమె బియస్సీ బియిడి మరి. పెళ్ళయి సంవత్సరం తిరగెలోగా 'పల్లవి' పుట్టింది... ఆ పాప ముద్దు ముచ్చట్లు, ఉద్యోగం, ఇంటిపని, కాలం వేగం దొర్లసాగింది... మరో రెండేళ్ళకి "చరణ్" పుట్టాడు. ఇంక క్షణం తీరిక లేకుండా పోయింది. ఎప్పుడయినా కాగితం కలం తీస్తెసరి ఇద్దరూ చెరో ప్రక్క చేరి రాయనిచ్చేవారు కాదు... రాత్రి రాద్దామంటే శ్రీకాంత్ గోల సరేసరి.

◆◆◆

పదేళ్ళు గిర్రున తిరిగిపోయాయి. ఒక్క పేజీ కూడా వ్రాయలేదు.. పిల్లలు కాస్త పెద్ద అయ్యారు... ఈ మధ్య మళ్ళీ వ్రాయలనిపిస్తోంది... అందుకు తగిన ప్రోత్సాహం కూడా లభిస్తోంది... రవితేజ నుంచి.. రవితేజ... రెండేళ్ళ క్రితం తను పని చేసే కాన్వెంట్‌లోనే చేరాడు.. తను పనిచేసే కాన్వెంట్ ఇప్పుడు సిటిలో లీడింగ్ కాన్వెంట్‌గా మారింది... క్రితం సంవత్సరం టెన్త్ పబ్లిక్‌లో స్టేట్ ర్యాంకులు తెచ్చుకొన్న, స్టూడెంట్స్‌ని తయారు చేసింది.. హిమజ ఆ కాన్వెంట్ పెట్టినప్పటి నుంచి పని చేస్తోంది... స్పెషల్ ఇంట్రెస్ట్ తీసుకొని పని చేస్తుందని ప్రిన్సిపాల్‌కి కూడా ఆవిడంటె చాలా ఇష్టం... రవితేజా కూడా చాలా సిన్సియర్... వారిద్దరి కృషివలనే కాన్వెంట్‌కి బాగా పేరు వచ్చింది... రవితేజ గాయకుడు... రచయితకూడా... అతని కథలు చూసినప్పుడు చెప్పింది తనూ ఒకప్పుడు కథలు వ్రాసిన విషయం.

"ఏ ఆర్ట్ అయినా ఒక రోజుఉంది మరో రోజు లేకుండా ఉండదండి... సృజనాత్మక శక్తి పదేళ్ళ క్రితం ఉంది అంటె వయసు తెచ్చిన అనుభవంతో అది పదింతలు అవుతుంది కాని చచ్చిపోదు... మీరు కృషి చేసి వెలుపలికి తియ్యండి" అంటూ వీలున్నప్పుడల్లా చెప్పేవాడు... హిమజ పాత కథలు చదివాక బాగా ఇంప్రెస్ అయ్యి "మీరు ఓ గొప్ప రచయిత్రిని "మర్డర్" చేస్తున్నారు. పోలీస్ కంప్లయింట్ ఇస్తాను అనేవాడు... అతను ఆమెకన్నా ఏడెనిమిదేళ్ళు చిన్న ఇరువురి అభిప్రాయాలు, అభిరుచులు కలవడంతో చాలా తక్కువ కాలంలో మంచి స్నేహితులయి పోయారు. వాళ్ళ చనువుని చూసి గిట్టని వాళ్ళు పుట్టించె పుకార్లు అప్పుడప్పుడు చెవిలో పడి బాధ పట్టేవి... అతనూ ఆ విషయం గ్రహించాడు... "బాధపడితేను, భయపడితేనూ పుకార్లు పుట్టవంటె బాధే ప డండి.... ఏడ్చేవాళ్ళను మరింత ఏడిపిస్తుందీ లోకం ... జాలి చూపదు... ఓదార్చదు... ఎదురుతిరిగితే తోక జాడిస్తుంది.. నన్ను మాట్లాడవద్దంటె మానేస్తాను, కష్టమయినా సరె" అనేవాడు... గుండె రాయి చేసుకొంది 'స్నేహాన్ని' వదులకోలేదు ఇద్దరూ... ఆమె సమస్యల్లా ఆమె అత్తగారే! ఆరోజు సంఘటన బాగా గుర్తు....

స్కూల్ యానివర్సరీ... బాధ్యతంతా హిమజ, రవితేజలదే... డ్రామా,

నత్యం, లలిత సంగీతం, ఫేషన్ పెరేడ్‌లు వగైరాలు చాలా ఉన్నాయి... మంచి డ్రామా వ్రాసి పిల్లల చేత చాలా బాగా ఏక్ట్ చేయించాడు రవితేజ... ప్రోగ్రామ్స్ ముగిసే సరికి రాత్రి పదిగంటలు దాటింది... హిమజ ఆలస్యం అవుతుందని చెప్పే వచ్చింది... తొమ్మిది గంటలకల్లా వస్తానన్న శ్రీకాంత్ పది అయినా రాలేదు... పదిన్నర వరకూ చూసి ఇంటి ముఖం పట్టింది రవితేజ తోడురాగా...

ఇళ్ళు దగ్గరికి రాగానే వెళ్ళిపోతానన్నాడు అతను... కాని అక్కడ దాకా వచ్చిన వాడిని వెళ్ళిపొమ్మంటె ఏం బాగుటుంది ... భర్త వచ్చి ఉంటే పరిచయం చేద్దామనుకొంది... అతను ఎప్పుడూ ఇంటికి రాలేదు ఎన్నోసార్లు రమ్మన్నా...

శ్రీకాంత్ ఇంకా ఇంటికి రాలేదుట. .. అత్తగారికి రవితేజని పరిచయం చేసింది... అతని ముందె ఆవిడ పెడసరంగా మాట్లాడింది...

"వస్తానండీ" వెళ్ళిపోయాడు.. హిమజ ఉండమనల్లేదు.

బాత్ రూం వైపు నడిచింది.. బయట స్కూటర్ ఆగిన చప్పుడు... శ్రీకాంత్ వచ్చినట్లున్నారు... మాటలు వినబడుతున్నాయి..

"హిమజ వచ్చిందా"? ఇంట్లోకి వస్తూనే అడిగారు.

"నాకు ఆఫీసులో లేటయింది.. తిన్నగా కాన్వెంట్‌కి వెడితే ఇప్పుడే వెళ్ళిపోయిందన్నారు ఎంత సేపయిందివచ్చి"

"ఆ నిక్షేపంలా వచ్చింది.. ఎవరో రవి అట... అతని "తో" వచ్చింది..."

"అతను సాయం వచ్చాడు అనొచ్చుగా" హిమజ మనసు మూలిగింది. శ్రీకాంత్ మాట్లాడలేదు. తల్లికి హిమజంటె అసలు పడదని తెలుసు. మౌనంగా తన గదిలోకి వెళ్ళబోయెడు.. కాని ఆవిడ నదల్లేదు..

ఆమెలోని రచయిత్రిని మర్డర్ చేసిన అతను.

"నీ పెళ్ళాం వరుస నాకేం నచ్చలేదురా... పెళ్ళికాని ఆ కుర్రాడితో కబుర్లు, షికార్లు ఏమిటె?" పైగా ఇంత రాత్రిపూట ఇద్దరూ కలసి వస్తే చూసినవాళ్ళు ఏమనుకొంటారు? మొన్న ప్రక్కింటి సుబ్బమ్మగారు వాళ్ళ మనవడిని చేర్పించటానికి కాన్వెంట్ కెళ్ళిందట.... హిమజని కలుసుకొంటె ఎలా జాయిన్ చేయ్యాలో చెబుతుందని హిమజ కోసం టీచర్ల గది దగ్గరి కెళ్ళిందట... వీళ్ళిద్దరూ పక్క పక్కని కూర్చుని ఒకటే కబుర్లు.. నవ్వులు... సుబ్బమ్మ చెబుతుంటే నా తల తీసేసినట్లయింది"

"అమ్మా! హిమజని నువ్వెప్పుడయినా మెచ్చుకొన్నావా.. దాన్ని ఆడి పోసుకోవడం తప్ప నీకు వేరేపనిలేదా? మా ఆఫీసులో టైపిస్ట్ సరోజను నేను ఇప్పటికి ఓ వందసార్లు ఆవిడ ఇంటి దగ్గర దిగబెట్టి ఉంటాను.. ఇలాంటి విషయాలు ఇంక ఎప్పుడూ నాకు చెప్పకు" గదిలోకి వెళ్ళిపోయాడు శ్రీకాంత్... మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకొంది... హిమజ. ..

"నీకేంరా.. నువ్వు మొగాడివి.. అయినా... నీకేం నాయినా! నీ పెళ్ళాం నీ ఇష్టం.. అలా పెళ్ళికాని వాడితో తిరగకూడదని చెప్పా తప్పా" అత్తగారు సణుక్కోవడం మానలేదు...

"పెళ్ళయిన వాడితోనే తిరగమని చెబుతాన్లే" గదిలోంచి శ్రీకాంత్ సమాధానం ఆవిడన మనింత ఉడికించింది...

◆◆◆

"ఏంటి... హిమా ఆలోచిస్తున్నావు... ఇంకా నిద్రపోలేదూ" ఎందుకో తెలివొచ్చిన శ్రీకాంత్ అడిగాడు... ఉలిక్కిపడి గతంలోంచి వర్తమానంలోకి.. అతని కౌగిలిలోకి వచ్చింది హిమజ...

"కథకి ముగింపు ఆలోచిస్తున్నానండీ' చెప్పింది...

"రేపు ఆలోచిద్దువుగానిలే.. ఇంక పడుకో" అంటూ ఆమె ఎదమీద తల వాల్చి పడుకున్నాడు శ్రీకాంత్...

◆◆◆

అయితే ఆ కథ పూర్తి చేయ్యటానికి ఆమెకి ఇంకో పదిహేను రోజులు పట్టింది .. అత్తగారి వరుస అంతె... శ్రీకాంత్‌లో కొంచెం అసహనం...చీకాకు.. కోపం చోటు చేసుకొంటున్నాయి.. కొత్తగా...

◆◆◆

ఆ రోజు రాత్రి కథ పూర్తి చేసి శ్రీకాంత్‌కి ఇచ్చింది చదవమని

"ఓ అందమైన పెళ్ళికాని యువతి కొన్ని విచిత్ర పరిస్థితులలో ఆమెకన్నా పదిహేనళ్ళు పెద్ద వాడయిన ఓ వ్యక్తికి చేరువవుతుంది... అతనికి అప్పటికే పెళ్ళయి పెళ్ళాం పిల్లలతో హాయిగా ఉంటున్నాడు. ఆమె ఓ బలహీన క్షణంలో అతనికి రెండవ భార్యగా వెళ్ళడానికి నిశ్చయించుకొని ఆ విషయం అతనికి చెబుతుంది... అతను చాలా పెద్ద మనసుతో అతని భార్యతో కలిసి చర్చించి ఆ అమ్మాయి మనసు మారుస్తాడు తరువాత ఆ అమ్మాయి ఈడైన వాడిని పెళ్ళి చేసుకొంటుంది..." ఇదీ ఆ కథ సారాంశం కథ చదివిన శ్రీకాంత్ మొహంలో రంగులు మారతాయి...

"ఎలా ఉందండీ?"... హిమజ మొహంలోకి సూటిగా చూసాడు...

"బాగుంది' ముక్తసరిగా చెప్పి అటు తిరిగి పడుకొంటాడు.

మర్నాడు కథను పోస్ట్ చెయ్యమని చెప్పి శ్రీకాంత్‌కి ఇచ్చింది.

నాలుగయిదు నెలలు గడిచాయి.. కథ పంపించిన పత్రికను క్రమం తప్పకుండా చూస్తోంది... ప్రచురించబడనూలేదు.. రిటర్న్ రానూ లేదు...

ఒక రోజు శ్రీకాంత్ షెల్ఫ్ సర్దుతున్నప్పుడు... బట్టల మధ్య నుంచి అతని డైరీ జారి పడింది... తెరచుకొన్న డైరీ కవరులో తన దస్తూరీతో ఉన్న కవరు కనపడింది... వణకుతున్న చేతులతో తీసి చూసింది.. అది.. అది.. తను పోస్ట్ చెయ్యమని ఇచ్చిన కవరు... అంటే తన కథని శ్రీకాంత్ పంపలేదా? మరచిపోయారనుకోవడానికి నమ్మకం కలగటం లేదు... అంటె కావాలనే పోస్ట్ చెయ్యలేదా?... అంటె తను మళ్ళీ కథలు వ్రాయటం ఇష్టలేదా?.. లేదా వ్రాయక వ్రాయక వ్రాసిన కథలోని హీరోయిన్ "విపరీత ధోరణి" నచ్చలేదా? తన 'కథ'ని తన జీవితానికి అన్వయించుకొని భరించలేక పోస్ట్ చెయ్యలేదా..? రచయిత్రుల రచనలలోని పాత్రలు అనేక వింత పోకడలు పోతూ ఉంటాయి... మరి వారి భర్తలు ఏమి అనరా?... ఈ మధ్య తన మీద ఎప్పుడూ లేనంతగా చికాకు పడుతున్నారు.. ఆలోచించి ఆలోచించి ఓ నిర్ణయం తీసుకొంది హిమజ...

◆◆◆

ఆ తరువాత ఆమె ఎన్నడూ కలం పట్టుకోలేదు...

ఎప్పుడూ చిరునవ్వులో పలకరించె హిమజ ముభావంగా ఉండటం... ముక్తసరిగా బదులివ్వటం... వీలయినంత వరకు తప్పించుకు తిరగటం... ఎందుకో రవితేజకి అర్థం కాలేదు.. తను ఏం తప్పు చేసాడో అర్థం కాలేదు... అతనిలోని రచయిత ఆమెలోని మార్పుకు కారణం కరెక్ట్‌గానే ఊహించగలిగాడు... అక్కడే ఉంటూ మాట్లాడకుండా ఉండగలగటం అసాధ్యం గాను, దుర్భరంగాను తోచింది .. రిజైన్ చేసేసి వెళ్ళిపోయాడు...

మూగగా రోదిస్తూ వీడ్కోలు చెప్పింది హిమజ.

◆◆◆